
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 జనవరి 2024



కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా గీకురు రవీందర్



చిగురుమామిడి, జనవరి 1: కాంగ్రెస్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా చిగురు మామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్‌ను నియమించినట్లు సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.తన ఎంపికకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- 2024కు స్వాగతం
- రోడ్లపై జనం సందడి

కరీంనగర్ కల్చరల్, జనవరి 1: జిల్లా అంతటా ఆదివారం అర్ధరాత్రి వరకు నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటగా సోమవారం జనమంతా 2024 సంవత్సరానికి స్వాగతాన్ని ఘనంగా తెలియజేశారు. ఆలయాలను సందర్శించి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం కలసి రావాలని మొక్కుకున్నారు. యువత, చిన్నారులు పుర వీధులు తిరుగుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు రంగవల్లులను వేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ప్రణాళికాసంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో, పాతబజార్ గౌరీశంకరాలయంలో పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ తదితర నాయకులు పాల్గొ న్నారు. మేయర్ సునీల్‌రావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమా రీలు క్యాలెండర్ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సీఎస్ఐ కెథడ్రిల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..

నగరంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ వెస్లి కెథడ్రిల్ చర్చ్‌లో బిషప్ డాక్టర్ కె రూబెన్‌మార్క్ ప్రత్యేక సందేశమిచ్చి ప్రార్థనలు చేయించారు. క్వాయర్స్ బృందం గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ఫాస్టరేట్ ఛైర్మన్ పాల్ కొమ్మాలు, అసిస్టెంట్ ప్రెస్బిటర్స్ మధుమోహన్, ప్రేంకుమార్, కార్యదర్శి దేవదాసు, కోశాధికారి నెల్సన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎఫ్‌సిఐలో నిల్వ చేసిన సీఎంఆర్ బియ్యం

సీఎంఆర్ బియ్యం స్వాహా

- 3.56 లక్షల క్వింటాళ్లు పక్కదారి
- ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ జోరుగా దందా

జమ్మికుంట, జనవరి 1: కస్టమ్ మిల్లింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించిన లక్షల క్వింటాళ్ల ధాన్యం స్వాహా చేశారు. కొందరు ధాన్యాన్ని నేరుగా విక్రయిస్తుండగా, మరికొందరు బియ్యంగా మార్చి పక్క రాష్ట్రాకు తరలిస్తున్నారు. జమ్మికుంట, ఇల్లందకుంటకు చెందిన 11 మిల్లుల నుంచి 3.56 లక్షల క్వింటాళ్ల ధాన్యం కస్టమ్ మిల్లింగ్ చేసి లేవిగా ఎఫ్‌సీఐకి పెట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు పెట్టలేదని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ఒకటి, రెండు మిల్లులోనే లక్షల బస్తాల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. మిగితా మిల్లుల్లో దాడులు కొనసాగితే, మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయా, లేవా అనేది తేటతెల్లం అవుతుంది.

● పక్క రాష్ట్రాలకు ధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం క్వింటాల్ ధాన్యం ఇస్తే, మిల్లర్లు మరాడించి 67కిలోల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి లెవీ రూపంలో పెట్టాల్సి ఉంటుంది. ఆరు నెలల వ్యవధిలో సిఎంఆర్ బియ్యం మొత్తం అప్పగించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం పలుసారు గడువు పొడిగించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న మిల్లర్లు ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలిస్తూ కోట్లాది రూపాయాలు సంపాదిస్తున్నారు. మరి కొందరు బియ్యంగా మార్చి తెగనమ్ముకుంటున్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం 2,150, సన్నరకం ధాన్యం 2,800, దొడ్డు రకం బియ్యం 2,700, సన్నరకం బియ్యం 3,500 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం.



జమ్మికుంటలోని ఓ మిల్లులో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు(ఫైల్)

● సన్న రకం ధాన్యం కొనని మిల్లర్లు

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి కామన్ రకం 2,040, గ్రేడ్ ఎ రకం 2,060 రూపాయలు చెల్లించి ప్రభుత్వం సేకరించింది. రైతులు తీసుకు వచ్చిన సన్న రకాలను కూడా కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్ ఏ రకం కింద మద్ధతు ధర 2,060 రూపాయలు చెల్లించి కొనుగోళ్ల చేపట్టారు. దిగుమతి సమయంలో మిల్లర్లు మిగితా (మద్ధతు ధర కంటే అదనపు) డబ్బులు 540 రూపాయలు రైతులకు చెల్లించారు. సన్నరకాలకు క్వింటాల్ 2,600 రూపాయలు చొప్పున చెల్లించారు.

● లెవీ కింద రిజెక్టెడ్ బియ్యం

సీఎంఆర్ బియ్యం నిభందనల ప్రకారం లేకుంటే ఎఫ్‌సీఐ అధికారులు రిజెక్ట్ చేస్తారు. రిజెక్ట్ అయిన బియ్యాన్ని గోల్‌మాల్ చేసి తిరిగి ఎఫ్‌సీఐకి పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. సీఎంఆర్ ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలిస్తూ వ్యాపారం చేస్తున్న మిల్లర్లు ఆ లోటును పూడ్చేందుకు తక్కువ ధరకు సేకరించిన రేషన్ బియ్యాన్ని రీసైకిల్ చేసి, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని కలిపి తిరిగి లేవీ రూపంలో పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక లారీలో 540 బస్తాలు (270 క్వింటాళ్లు) ఉంటాయి. రిజక్ట్ అయిన బియ్యాన్ని నాణ్యమైన బియ్యం బస్తాల కింద అడుగులో వేసి ఎఫ్‌సీఐకి ఇవ్వడం పరిపాటిగా మారింది.

భవిష్యత్ అవసరాలకు డీసీసీబీ సిబ్బందికి శిక్షణ

- నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



నూతన సంవత్సర కేక్ కట్ చేసి పంచుతున్న నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 1: కరీంనగర్ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకులోని అన్ని స్థాయిల ఉద్యోగులకు భవిష్యత్తు అవసరాల కోసం సన్నద్ధం కావడానికి శిక్షణ ఇస్తామని నాఫ్‌స్కాబ్, టెస్కాబ్, డీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాబార్డును సంప్రదించి సీనియర్ స్థాయి అధికారులతో సహా అన్ని స్థాయిల అధికారుల కోసం కోర్సులను రూపొంది స్తామని, ఎక్స్‌పోజర్ విజిట్లను, శిక్షణను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తా మన్నారు. సుపరిపాలన, సాంకేతికత వినియోగంలో డీసీసీబీ ముందుం టుందని తెలిపారు. సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతికతను మెరుగు పరచ్చుకోవాల్సిన అవవసరాన్ని వివరించారు. వ్యాపారం పెంపుదలకు తమ వద్ద పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సెల్, బిజినెస్ డెవలప్‌మెంట్ సెల్ ఉన్నాయన్నారు. బ్యాంకు డిపాజిట్లను పెంచడంలో ఉద్యోగులందరూ బాధ్యతా యుత పాత్ర పోషించాలని సూచించారు. రానున్న మూడు నెలల కాలంలో రుణాలు, డిపాజిట్ల రికవరీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీసీసీబీకి ఎలాంటి సహకారమైనా అందిస్తామని నాబార్డు డీడీఎం జయ ప్రకాశ్ తమకు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పి రమేష్, డీడీఎం పి మనోహర్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, యూనియన్ నాయకుడు హనుమంతరావు, మెయిన్ బ్రాంచి మేనేజర్ కె సునీల్, సేల్స్ అధికారి వంశీ పాల్గొన్నారు.



మానకొండూర్‌లో పిచ్చి మొక్కలతో నిండిపోయిన ఎస్సారెస్పీ ఉపకాలువ

ఎస్సారెస్పీ ఉప కాలువల్లో పిచ్చి మొక్కలు..

మానకొండూర్, జనవరి 1: మండలంలోని ఎస్సారెస్పీ ఉపకాల్వలు పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందుతుందో లేదోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్ఎండీ రిజర్వాయర్ నుంచి కాకతీయ కాల్వ ద్వారా మండలంలోని సదాశివపల్లిలోని డీబిఎం 2 ఉపకాల్వ నుంచి కొండపల్కల డీబిఎం 7 ఉపకాల్వ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు సరఫరా అవుతోంది. డీబీఎం 6 ఉపకాల్వ ద్వారా దేవంపల్లి నుంచి జమ్మికుంట మండలంలోని వివిద గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతుంది. ఎస్సారెస్పీ ఉపకాల్వలు పిచ్చి మొక్కలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. వానాకాలం సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగునీరు అందలేదు. దిగువ జలాశయం నుంచి కాకతీయ కాల్వకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం నీటిని విడుదల చేశారు. యాసంగి పంటకు మండల రైతులు సాగు చేసినప్పటికి చెరువులు, కుంటలను నింపేందుకు గాను వారాబందీ కింద నీటి సరఫరా చేస్తున్నారు. మార్చి 31 వరకు వారాబందీ కింద ఆయకట్టు రైతులకు దిగువ జలాశయం నుంచి ఎస్సారెస్పీ అధికారులు పంట పూర్తి అయ్యేంత వరకు నీటి సరఫరా చేస్తారు. ఉపకాల్వలు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయి నీరంత వృథా పోవడమే కాకుండా చివరి ఆయకట్టుకు అందదు. వేసవిలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఉప కాల్వలను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎల్లా రెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మారుపాక రాజు సోమవారం నియమితులయ్యారు. జిల్లాలో స్వేరోలను పటిష్టపర్చడంతో రాజు కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా రాజు స్వేరో నెట్‌వర్క్‌లోని అన్ని అనుబంధ సంఘాలను కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు సేవా పతకాలకు పలువురి ఎంపిక

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు సేవా పతకానికి జగిత్యాల జిల్లా నుంచి ఆరుగురు పోలీసు అధికారులు, ఉద్యోగులు ఎంపికయ్యారు. సోమ వారం రాష్ట్ర హోం శాఖ ప్రకటించిన సేవా పతకాలకు జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ మహమ్మద్ సామ్ దానీ, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ శ్రీపెరంబదూరు ఆంజనేయులు, జగిత్యాల దరూర్ క్యాంపు లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్‌ఐ వెన్నంపల్లి రవీందర్, కోరుట్ల అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అవుదుర్తి తిరుపతి, వెల్గటూరు హెడ్ కానిస్టేబుల్ ఆత్రం బహదూర్ షా ఎంపికయ్యారు. మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు స్టేట్ ఫైర్ సర్వీస్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు.

● **రాజన్న సిరిసిల్ల జిల్లాలో..**

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నలుగురు పోలీసు అధికారులు, ఒక ఫైర్ అధికారి పోలీస్ ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లాలో పోలీసుశాఖలో పని చేస్తున్న పున్నం మహేందర్‌రెడ్డి (ఏఆర్ ఎస్‌ఐ), ఎం రాజ్‌కుమార్ (ఏఆర్ హెచ్‌సీ), గొంటి ప్రభాకర్ (రుద్రంగి హెడ్ కానిస్టేబుల్), గోనె తిరుపతి (ఏఆర్ హెచ్‌సీ), కె మహేం ద్రాచారి (ఫైర్‌మెన్, వేములవాడ) సేవా పతకాలకు ఎంపికయ్యారు.

● **రామగుండం కమిషనరేట్‌లో..**

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి పోలీస్ సేవా పతకాలు లభించాయి. ఏఆర్‌ఎస్‌ఐ కాంపెల్లి లింగయ్య, మంచిర్యాల ట్రాఫి క్ ఎస్‌ఐ నీరటి రామరాజు, తాళ్లగురిజాల ఏఎస్‌ఐ మామిడి రాజన్న, పెద్దపల్లి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నీర్ల వేణుగోపాల్, లక్సెట్టిపేట హెడ్ కానిస్టేబుల్ ఇష్తాకర్ అహ్మద్, దండేపల్లి హెడ్ కానిస్టేబుల్ అజ్మీరా గంగ్యా నాయక్‌లు పతకాలకు ఎంపికయ్యారు.

రేపు కరీంనగర్ జోన్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 1: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు నగునూరులోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో కరీంనగర్ జోన్ స్థాయి అండర్-14 బాలబాలికలకు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల ను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఫొటోపై హెడ్‌మాస్టర్ సంతకం చేసిన ఎలి జిబులిటీ ఫాం, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో హాజరు కావాలని సూచించారు.

రేపు కట్కాపూర్‌కు కేంద్ర బృందం రాక

రాయికల్, జనవరి 1: మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను ఈ నెల 3న కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన (ఎన్‌క్వాస్)లో భాగంగా బృందం పరిశీలించి ఏడు విభాగాల్లో అందుతున్న సేవలను, రికార్డులను పరిశీలిస్తారని చెప్పారు. ఆయా విభాగంలో ఉన్నత మార్కులు సాధిస్తే యేటా మూడేళ్ల పాటు నిధులు మంజూరవుతాయన్నారు. జాతీయ గుర్తింపు పొందడానికి పల్లె దవాఖానాను సిద్ధం చేశామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

జగిత్యాల రూరల్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆల యంలో పూజలు చేయడానికి స్కూటీ పై వెళ్తున్న మహిళను మృత్యువు కబళిం చింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన సామ సుజాత (42) తన స్కూటీ పై జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ఆలయంలో పూజలు చేయడానికి బయ ల్దేరింది. పొలాస వద్ద గల ఆలయ కమాన్ సమీపంలో ధర్మపురి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సుజాతను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న స్థానికులు సుజాతకు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సుజాతకు కూతురు ఉంది. సుజాత భర్త హేమేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మహాలక్ష్మి స్కీంపై ఆర్టీసీ సిబ్బందికి సూచనలు

భగత్‌నగర్, జనవరి 1: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ ఈడీసోమవారం మహాలక్ష్మి స్కీంపై సిబ్బందికి సూచనలు అందజేశారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆవరణలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆర్టీసీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానిక్) ఎం సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, బస్టాండ్ ఎంటీఎం రజనీకృష్ణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, ఏటీఎం కార్గో ఎస్ సదాశివ, బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 1: కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఒక అపార్ట్ మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గొర్రె లక్ష్మీరాజం(55) కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన లక్ష్మీరాజం కట్టరాంపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్ మన్‌గా ప ని చేస్తున్నాడు. డిసెంబరు 29న మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆంజనేయులుకు చెందిన ఆవుదూడ బయటకు పరుగెడుతుం డగా అడ్డుగా పోయి తాడు కాళ్లకు తట్టుకుని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తర లించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దూడ యజమాని ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య కనకతార పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానేరులో చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


దాసరి శ్రావణ్(ఫైల్)

గన్నేరువరం, జనవరి 1: లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ చంద్ర నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్(22) సోమవారం ఉదయం లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. రోజు లాగే శ్రావణ్ ఉదయం 6గంటలకు బైక్‌పై చేపల వేటకు డ్యాంకు వెళ్లి మధ్యాహ్నం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి వెంకటయ్య మరికొంత మందితో కలిసి తెప్పలపై మానేరు నీటిలో వెతకడంతో యువకుడి మృతదేహం లభ్యమైంది. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నూతన సంవత్సరం రోజే యువకుడు మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి మృతి


అరుణ్‌కుమార్(ఫైల్)

చందుర్తి, జనవరి 1: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మల్యాలకు చెందిన నేవూరి అరుణ్‌కుమార్ (28) అనే యువకుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై పాలను సరఫరా చేసేందుకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొన్ని సంవత్సరాల క్రితం సిరిసిల్ల గ్రామానికి చెందిన అనూష అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అరుణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు చంద్రయ్య, లక్ష్మీనర్సవ్వ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి

ఇల్లంతకుంట, జనవరి 1: మండలంలోని రంగాపేట గ్రామానికి చెందిన ఎలవేని పర్శరాం (55) అనే మత్స్యకారుడు సోమవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పర్శరాం సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై మధ్యమానేరుకు బయల్దేరాడు. వల్లంపట్ల గ్రామసమీపంలో ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి రోడ్డు పక్కన ఉన్న బురదలో పడి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 1: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్శకొండ మల్లమ్మ (80) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ, జనవరి 1 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వ కేటాయించిన కొత్త ఇన్నోవా వాహనానికి రాజన్న సన్నిధిలో సోమవారం సాయంత్రం ఆది శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వామివారిని దర్శించుకొని కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో జడ్పీ చైర్ పర్సన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం గావించారు.

రాజన్న సేవలో ఎన్నికల పరిశీలకుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకుడు మణిగండ స్వామి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.

రాజస్థాన్‌లో ఆర్మీ జవాన్ మృతి

● జగ్గారావుపల్లిలో విషాదం


శివకుమార్ (ఫైల్)

బోయినపల్లి, జనవరి 1: బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చాద శివకుమార్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివకుమార్ సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివకుమార్ రెండేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం పొందాడు. రాజస్థాన్‌లోని డియోలిలో 16వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తుండగా డిసెంబరు 16న బాత్ రూమ్‌లో జారీ కిందపడ్డాడు. తలకు గాయమై కోమాలోకి వెళ్లాడు. తోటి సిబ్బంది జైపూర్‌లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శివకుమార్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ ఆనందంగా తిరిగి విధులకు వెళ్లాడు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శిక్షణకు సమయం ఉండడంతో తిరిగి రాజస్థాన్ వెళ్లి విధుల్లో చేరాడు. శివకుమార్ తల్లిదండ్రులు ఇద్దరు గోపాలరెడ్డి భాగ్యమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోదరుడు గంగారెడ్డి సిరిసిల్లలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

ప్రమాదకరంగా రహదారి

● వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి
● కనిపించని హెచ్చరిక బోర్డులు

హుజూరాబాద్ రూరల్, జనవరి 1: హుజూరాబాద్ మండలం మీదుగా వెళ్తున్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారుతోంది. వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మండలంలోని తుమ్మనపల్లి శివారులో డిసెంబరు 27న సింగాపూర్ గ్రామానికి చెందిన గాడి అనిల్‌రెడ్డి(29) స్వగ్రామానికి వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై వస్తున్న క్రమంలో ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిసెంబరు 28న అర్ధరాత్రి జాతీయ రహదారి పనుల్లో కూలీ పనిచేస్తున్న వినోద్ కోలే(29) తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం బయటికి వెళ్లి తిరిగి సింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలోనే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో వినోద్ కోలే అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని తుమ్మనపల్లి, సింగాపూర్ గ్రామాల సమీపంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై కాట్రపల్లి-ఇందిరానగర్, చెల్పూర్, రంగాపూర్, సిర్సపల్లి, పర్కాల్ క్రాస్, కందుగుల, దమ్మక్కపేట క్రాస్‌లు డేంజర్ స్పాట్‌లు మారాయి.


రంగాపూర్‌లో జమ్మికుంట-హుజూరాబాద్ రహదారిపై ప్రమాద దృశ్యం(ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టాలి

- బాషవేణి రాజేష్‌యాదవ్, సింగాపూర్



సింగాపూర్ శివారులో రాత్రి పూట ప్రధాన రహదారిపై బైక్‌తో వెళ్లాలంటే భయపడుతున్నాం. భారీ వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డేంజర్ స్పాట్‌ల వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

వాహనదారులు నిబంధనలను పాటించాలి

-సిరాజ్ ఉర్ రహమాన్, ఎస్ఐ, హుజూరాబాద్



ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించాలి. స్పీడ్ బ్రేకర్ల వద్ద, మూల మలుపుల వద్ద, టర్నింగ్ పాయింట్లు, సైడ్ తీసుకుంటున్న సమయంలో ఇండికేటర్లను తప్పనిసరిగా వినియోగించాలి. రాత్రిపూట లైట్స్ లేకుండా వాహనాలను నడపవద్దు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి,జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేకొండలోని హాలిక్ శ్రమజీవి కోఆపరేటివ్ సొసైటీలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా సీపీఐ బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని గద్దె దింపడమే సీపీఐ ఏకైక లక్ష్యం అన్నారు. మతం, కులం పేరుతో పనిచేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే ఏ పార్టీని సహించేది లేదన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, ఎంపీటీసీ అందె స్వప్నస్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, సొసైటీ చైర్మన్ మండల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

వెల్గటూర్, జనవరి 1: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన బూపెల్లి పోచమ్మ (64) అనే మహిళ సోమవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు పోచమ్మ సంవత్సర కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధ పడుతోంది. వ్యాధి నివారణకు చికిత్స నిమిత్తం ప్రతి రెండు రోజులకు ఒకసారి కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి కీమో తెరపీ చేయించుకునేది. నాలుగు రోజులుగా వ్యాధి తీవ్రత పెరగడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. పోచమ్మ భర్త బూపెల్లి గంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నందగిరిని కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలి

గంగాధర, జనవరి1: కరీంనగర్ జిల్లాలో కోట్ల నర్సింహులపల్లిలో విశేష చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కలిగిఉన్న ప్రాంతాన్ని నందగిరితో కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిశోధన సమితి కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగి నాటి నుంచి నేటి తరానికి దిక్సూచిగా నందగిరి కోట, కోట్లనర్సింహులపల్లి వీరభద్ర దేవాలయం, నరసింహుని దేవాలయాలతో పాటు జైనుల సంపద ఉందన్నారు. క్రీ.పూ రెం 3వ శతాబ్దం నుంచి జైన, వైష్ణవ మత సామరస్యానికి వేదికగా ఎందరో రాజులు పాలించిన కేంద్రంగా విరసిల్లిందన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి పరుచుటకు చొరవ చూపాలన్నారు.చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలైన కోటిలింగాల, బొమ్మలమ్మ గుట్ట, నందగిరి, ధర్మపురి,వేములవాడను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధంగా చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఈ ప్రాంతానికి ప్రాధాన్యతతో పాటు ఆదాయం, అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


దేవాలయాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ, జనవరి 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు కావడం, మేడారం సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తుండడం కారణంగా పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ అధికారులు గర్భాలయంలోకి ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయం లోకి ప్రవేశించిన భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ పర్యవేక్షకులు బి.తిరుపతిరావు, అల్లి శంకర్, పరిశీలకులు అశోక్, పవన్ తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, దాదాపు 20 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

గోదావరిఖనిలో కూలీ హత్య

కోల్‌సిటీ, జనవరి 1: గోదావరిఖని నష్టగిరికాలనీ మున్సిపల్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో ఆదివారం రాత్రి వెనకర్ల గంగాధర్‌రావు(30) అనే కూలీ హత్యకు గురయ్యాడు. గంగాధర్‌రావు, అభితేజ అనే ఇద్దరు మద్యం సేవిస్తున్న సమయంలో గొడవ పడినట్లు తెలుస్తోంది. పరస్పరం దూషించుకోగా అభితేజ గంగాధర్ రావు తలపై రాడ్‌తో కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అభితేజ 108కు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది వచ్చే సరికే గంగాధరరావు మృతి చెందాడు. దీంతో అభితేజ, అతని భార్య సునీత పరారయ్యారు. అభితేజ వేములవాడలో ఒక బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. పిల్లలు లేని అతడు పెంచుకునేందుకు బాలుడిని తీసుకెళ్లడంతో కేసు నమోదు అయ్యింది. మృతుడు గంగాధర్‌రావు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం. అతని బంధువులకు సమాచారం ఇచ్చినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ఘనంగా పుష్పోత్సవం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 1 : మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంలో స్వామి వారికి పుష్పోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. పుష్పోత్సవ కార్యక్రమానికి ముంబాయి, హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలతో రాధా కృష్ణులకు అభిషేకం చేశారు. నిర్వాహకులు శ్రీమాన్ నరహరి ప్రభుజీ ప్రవచనం ఇచ్చారు. భక్తులు నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దాపూర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఉత్సవమూర్తులు


కోరుట్లలో అయ్యప్పస్వామికి లక్షపుష్పార్చన

కోరుట్లలో లక్షపుష్పార్చన

కోరుట్ల : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం లక్ష పుష్పార్చన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్ మంత్రోచ్ఛరణ మధ్య లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అయ్యప్ప అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ గౌరవ అధ్యక్షుడు చిద్దాల నారాయణతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప స్వాములకు బిక్షను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు

● వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
● రైతులకు తప్పని అవస్థలు

జమ్మికుంట, జనవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు ఆన్‌లైన్ చిక్కులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంటల వివరాలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పత్తి అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పేరు కనిపించినా, పంట విస్తీర్ణం తక్కువగా నమోదై ఉంటుంది. దీంతో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

సీసీఐ ద్వారా ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి సేకరణ

ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి సీసీఐ సేకరిస్తోంది. అంతకు మించి అదనంగా క్వింటాల్ పత్తి కూడా సదరు రైతు సీసీఐకి విక్రయించుకునే పరిస్థితి లేదు. తక్కువ పంట విస్తీర్ణం నమోదైన రైతులు ఇతర రైతుల పేరు మీద అమ్ముకునే వెసులు బాటు ఉంది. ఆ రైతు తన పంటను మళ్లీ సీసీఐకి విక్రయించుకునే అవకాశం ఉండదు. మళ్లీ ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.


జమ్మికుంట మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలు

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

సుల్తానాబాద్, జనవరి1: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో చుక్క రాజు (31) అనే రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్యాల పల్లి గ్రామానికి చెందిన చుక్క రాజు సోమవారం ఉదయం పంట పొలానికి నీరు పెట్టడం కోసం ఇంటి నుంచి వెళ్లాడు. ఆలస్యమైనా ఇంటికి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం చూడగా పొలం వద్ద మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఏదైనా అనారోగ్య కారణాలతో చనిపోయాడా లేక మరేదైనా కారణంతో మృతి చెందాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు మృతుడు రాజు భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చామంటలో నేలరాలిన పచ్చిమిర్చి(ఫైల్)

పంట నష్టపరిహారం వచ్చేనా?

● కొత్త ప్రభుత్వంపై ఆశలు ● వేలాది మంది రైతులు ఎదురుచూపులు

చొప్పదండి, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ చివరివారంలో కురిసిన వడగళ్ల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించిన పంటకోత దశలో కురిసిన వడగళ్ల వర్షం ధాటికి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పెట్టిన పెట్టుబడి కాస్త భూమిపాలుకాగా అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కనీసం పరిహారం కోసం పరిస్థితి లేకుండా తగలబెట్టుకున్నాడు. ఈ సేవర్లలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేల రూపాయల నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించి, నష్టపోయిన పంట పొలాలను సర్వే చేశారు. అధికారులు పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వానికి నివేదించగా ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంట నష్టపరిహారం రైతులకు అందలేదు. మండలంలో ఏప్రిల్ చివరి వారంలో కురిసిన వడగళ్ల వర్షం ధాటికి 5,083 ఎకరాల్లో వరి, కూరగాయలతోపాటు ఇతర పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. చొప్పదండిలో 1,140 ఎకరాలు, వెదురుగట్టులో 1,789 ఎకరాలు, చామంటలో 460 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రుక్మాపూర్‌లో 392 ఎకరాల్లో, కోలిమికుంటలో 342, చిట్యాలపల్లిలో 124, గుమ్లాపూర్‌లో 342, మొత్తం 5,083 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 6,023 మంది రైతులు పంట నష్టపోగా, పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా రైతులు పంట నష్ట పరిహారం వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చొప్పదండిలో ధ్వంసమైన వరి పంట(ఫైల్)

పద్మనాయక వెలమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెలమ సంఘం నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి 1: కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు, బోయినిపల్లి వినోద్ కుమార్, ఆల్‌ఇండియా వెలమ సంఘం నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావులు సోమవారం ఆవిష్కరించారు. కరీంనగర్ వెలమ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, పద్మనాయక వెలమ సంఘం జిల్లా అధ్యక్షులు జువ్వాడి వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులు గండ్ర సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి చిట్టి ప్రకాష్ రావు, సంయుక్త కార్యదర్శి బోయినిపల్లి భూపతిరావు, కోశాధికారి నిమ్మనేని భీమ్‌రావు, కార్యవర్గ సభ్యులు అనిల్ కుమార్, శంకర్‌రావు, మోహన్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, మాధవరావు, రఘురాం రావు, రాజగోపాల్‌రావు, వేణుగోపాలరావు, సుధాకర్‌రావు, అశోక్‌రావు, గీత, మంజుల పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జనవరి 1: టీఎన్‌జీవో రూపొందించిన ఆంగ్ల నూతన సంవత్సరం క్యాలెండర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా, టౌన్ క్యాలెండర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేవారు పూలబొకేలు, స్వీట్లు తీసుకురాకుండా పేదలకు ఉపయోగపడే వస్తువులను తీసుకురావాలని కలెక్టర్ సూచన మేరకు 50 బెడ్‌షీట్లు, బ్లాంకెట్లును కలెక్టర్‌కు అందచేశామని దారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కేంద్ర సంఘం నాయకుడు నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, అఫ్జలుద్దీన్, ఒంటెల ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, కార్యదర్శి సుమంత్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి కిషన్, తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్షుడు పోలి కిషన్, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద, సబిత, సునీత, సరిత, సుస్మిత, శైలజ, విజయలక్ష్మి, రాధిక, మల్కా రాజేశ్వర్‌రావు, భైరి శ్రీనివాస్, బాస పవన్‌కుమార్, నగేశ్, కొండయ్య, మహ్మద్ అజ్గర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి నరసింహారెడ్డి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షకార్యదర్శి కేశవరెడ్డి, లింగయ్య, చల్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ కార్యదర్శి రోళ్ళ సతీష్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, నగర కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు ఎండి ఇమ్రాన్, చోటు, దీకొండ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి శ్రీరాముడి అక్షింతలు అందజేత



అక్షింతలను ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

భగత్‌నగర్, జనవరి1: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు అయోధ్య రాముడి అక్షింతలను ట్రస్టు సభ్యులు సోమవారం ఆయన నివాసంలో అంద జేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్‌తో పాటు, పలువురు ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన బీసీ కమిషన్ చైర్మన్

హుజూరాబాద్, జనవరి 1: హుజూరాబాద్ పట్టణానికి చెందిన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణ మోహన్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎంను కలిసిన వకులాభరణం

మంత్రులను కలిసిన వొడితెల ప్రణవ్





మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిసిన ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 1: హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వొడితెల ప్రణవ్ నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు చేయూత అందిద్దాం

●చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



నోటు బుక్స్ అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

గంగాధర, జనవరి 1: నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు చేయూతనందించడానికి ముందుకు వచ్చిన ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. నూతన సంవత్సర సందర్భంగా సోమవారం గంగాధరలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సత్యం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ తన పిలుపు మేరకు నూతన సంవత్సరంలో శుభాకాంక్షలు తెలపడానికి శాలువాలు,పుష్పగుచ్ఛాలు తీసుకురావద్దని చేసిన విజ్ఞప్తి మేరకు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున నోట్ బుక్స్, పెన్నులను బహుమతిగా అందించడం సంతోషంగా ఉందన్నారు. వీటిని పేద విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కోరుకున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గణేశ్‌నగర్, జనవరి 1: ఇందిరాచౌక్ వద్ద నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సోమవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకొనే విధంగా ఆరు గ్యారంటీలు అమలు జరుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్, ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అఖిల్, కుర్ర పోచయ్య, గడ్డం విలాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, ముల్కల కవిత, అన్నే జ్యోతిరెడ్డి, ఊరడి లత, దన్నసింగ్ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు పొన్నం అనిల్ గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

●బీఆర్‌ఎస్ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు పాల్గొన్నారు.

●హుజూరాబాద్: డివిజన్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. హుజూరాబాద్ క్లబ్‌లో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు కేక్ కట్ చేశారు.

●శంకరపట్నం: మండలంలో నూతన సంవత్సరం వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. పలువురు యువకులు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచారు.

●మానకొండూర్: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు నృత్యాలు చేస్తూ కేక్ కట్ చేశారు.

●తిమ్మాపూర్: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు భక్తులు ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●గంగాధర: గంగాధరలో కొత్త సంవత్సరం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ అభిలాష్ బందోబస్తు నిర్వహించారు.

●చొప్పదండి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చొప్పదండిలోని శ్రీ శివకేశవ ఆలయం, సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





తెలంగాణ చౌక్ వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

అన్నదానం గొప్పది

కరీంనగర్ రూరల్, జనవరి 1: దానాలన్నింటిలోకి అన్నదానం గొప్పదని వేదపండితులు శ్రీదుర్గా భవాని ఆలయ ధర్మాధికారి పురాణంమహేశ్వర శర్మ అన్నారు. సోమవారం కరీంనగర్‌రూరల్ మండలం నగునూరులోని శ్రీదుర్గా భవాని దేవాలయంలో శ్రీశృంగేరి శారద నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఆకలితో బాధపడే వారికి కాస్తంత అన్నం పెడితే అన్నదాత సుఖీభవ అని దీవిస్తారని దాతలకు అమ్మవారి కృప కటాక్షలు లభిస్తాయన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదంగా అన్నప్రసాదాన్ని అందించడం ద్వారా దాతలకు అమ్మవారి కరుణ కటాక్షాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణశర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, అన్నదాన నిర్వహణ బాధ్యులు రాచమల్ల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు

భగత్‌నగర్, జనవరి 1: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ మాజీ ఎంపీపీ, కొత్తపల్లి ఒకటో వార్డు సభ్యుడు వాసాల రమేష్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపల్లి పట్టణంలో వాసాల రమేష్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను గడప గడపకూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాడి సుధాకర్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

కరీంనగర్ టౌన్, జనవరి 1: చైల్డ్ అండ్ ఉమెన్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని మురికివాడల్లోని బాలికలకు పౌష్టికాహారం, కోడిగుడ్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సానాది వెంకటేష్, వైస్ చైర్మన్ పోతుల రమేష్, తుంగ బాబురావు, సానాది మునిరాజ్, పోతుల రాజేష్, ఎలుక ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

సుభాష్‌నగర్, జనవరి 1: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్, విద్యార్థులకు నోట్‌బుక్స్ వృద్ధులకు చీరల పంపిణి చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పేదరాలికి ఉపాధి కల్పించడం కోసం కుట్టు మిషన్ అందించి ఉపా ధిని కల్పించారు. పేద విద్యార్థికి నోటు బుక్స్ స్టేషనరీ అందజేశారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన పోలీసులకు పతకాలు



కాశెట్టి కిషన్ ఏఎస్ఐ | చాంద్‌పాషా ఏఎస్ఐ | రాంమోహన్ హెడ్‌కానిస్టేబుల్ | గణపతి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ | ఓదయ్య కానిస్టేబుల్

కరీంనగర్ క్రైం, జనవరి 1 : రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖ, అనుబంధ శాఖల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పలు సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో పనిచేస్తున్న ఎస్ఐ ఎండీ అమ్జద్‌కు రాష్ట్ర పోలీసు మహోన్నత సేవా పతకం వచ్చింది. కరీంనగర్ మహిళా ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ కాశెట్టి కిషన్, ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ నాగులపల్లి నర్సింహా, రామడుగు ఠాణా హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, ఏఆర్ ఎస్ఐ రాజిరెడ్డి (పీటీసీ), శ్రీనివాస్(ఇంటలిజెన్స్, హెడ్ కానిస్టేబుల్)లు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. వెంకటరమణ మూర్తి-హెచ్‌సీ(చిగురుమామిడి), చింతపల్లి యుగేందర్-హెచ్‌సీ(గన్నేరువరం), చాట్ల సుధాకర్-హెచ్‌సీ (కరీంనగర్), ఈగ మల్లేశం-హెచ్‌సీ(కరీంనగర్), జండలపల్లి ఓదయ్య-పీసీ (కరీంనగర్), ఏఎస్ఐ ఎండీ చాంద్‌పాషా(కరీంనగర్-1), శనిగరం జాన్-హెచ్‌సీ (కొత్తపల్లి), కంసాని వేణు-హెచ్‌సీ(చొప్పదండి), సిరిసిల్లశంకరయ్య-హెచ్‌సీ(మానకొండూర్), కాదర్ల మురళీధర్-పీసీ (చిగురుమామిడి), రాం మోహన్-హెచ్‌సీ(చిగురుమామిడి), గణపతి-ఏఆర్‌హెచ్‌సీ(కరీంనగర్), పీటీసీ ఎస్పీ ఎస్ శ్రీనివాస్, డీఎస్పీ విజయపాల్‌రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్, ఇంతియాజ్ అలీ (ఇంటలిజెన్స్-కరీంనగర్)లకు సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో హెచ్‌సీ శ్రీనివాస్, ఎస్ఐ కాంపల్లి నారాయణ బాబులు ఉత్తమ సేవా పతకాలకు ఎంపిక కాగా, సీఐ ప్రశాంత్‌రావు సేవా పతకానికి ఎంపిక య్యారు. అగ్నిమాపకశాఖలో ప్రభాకర్-ఏడీఎఫ్ఓకు ఉత్తమ సేవాపతకం, రాం చందర్(డ్రైవర్)కరీంనగర్‌కు సేవా పతకాలకు ఎంపికయ్యారు.



సుధాకర్ హెడ్ కానిస్టేబుల్ | భూమయ్య హెడ్ కానిస్టేబుల్ | వేణు హెడ్ కానిస్టేబుల్ | నర్సింహా హెడ్ కానిస్టేబుల్

'అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం'

సుభాష్‌నగర్, జనవరి 1: ఆనాటి అంబేద్కర్ స్ఫూర్తిని నేటికి కొనసాగిస్తున్నామని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో భీమ్ కోరేగామ్ విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1818 జనవరి 1న తెల్లవారు జామున మహర్ బెటాలియన్ పూనా పేష్వా రాజు సైన్యంపై విజయం సాధించిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రతి సంవత్సరం జనవరి 1న పూణెలోని భీమ కోరేగామ్‌లో మహర్ అమరవీరుల స్థూపం దగ్గర విజయదివస్‌ను నిర్వహించేవారని తెలిపారు కార్యక్రమంలో మొగురం రమేశ్, బొయిని పల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్, దొంత కనకయ్య, తరల్ల నరసయ్య, కర్ర జననికుమార్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



రాముని అక్షింతలకు పూజలు నిర్వహిస్తున్న రామతీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు



హుజూరాబాద్‌లో శ్రీరాముడి అక్షింతలను వితరణ చేస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్, జనవరి 1: అయోధ్య రామమందిర తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలకు రేకుర్తిలోని అమృతేశ్వరమహాశివాలయంలో ఉంచి గడపగడకు పంపిణీ చేశారు. నగరంలోని 18వ డివిజన్ రేకుర్తిలోని ద్వారాకనగర్ అమృతేశ్వర మహాశివాలయంలో అయోధ్య రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో విచ్చేసిన అక్షింతలను స్థానిక రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో గడపగడపకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో 18వడివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణగౌడ్, మాజీ ఎంపిటీసీ జక్కుల నాగరాణిమల్లేశం, ట్రస్టు కార్యదర్శులు కూర నవీన్‌రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, జాడి బాల్‌రెడ్డి, పొన్నాలరాము, అఖిలేశ్వర్, అంజన్ సాయి, సాయికుమార్, సాయి సజన్, కసిడి రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో అయోధ్య శ్రీరాముడి స్వర్ణ అక్షింతలను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటికి తిరుగుతూ వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహం ప్రతిష్టాపన జరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ సాయంత్రం వేళలో ఐదు దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో నిరంజనచారి, రాజశేఖర్, గంగిశెట్టి రాజు, తూర్పాటి రాజు, శ్రీనివాస్, సదానందం, సందీప్, సతీష్, భార్గవ్, రఘుపతి, దేవరాజ్, భూపతిరాజ్, రాజశేఖర్, మోహన్, సునీల్, రాజు, అనిల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో అయోధ్య రామమందిర్ తీర్థ ట్రస్టు నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు, కలశంను కీర్తనలు, భజనలతో హనుమాన్ దేవాలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోకిరాల కిషన్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, చొక్కారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, ఇంద్రసేనరెడ్డి, ఆదిరెడ్డి, సంతోష్, కొండాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్ : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన తలంబ్రాలు సైదాపూర్ మండలానికి చేరుకున్నాయి. రామ భక్తులు, బీజేపీ నాయకులు ఆ తంబ్రాలను ప్రతీ గ్రామానికి చేర్చుతున్నారు. అన్ని గ్రామాలకు తంబ్రాలు చేరిన అనంతరం ప్రతీ ఇంటికి తలంబ్రాలు పంచనున్నారు. సోమవారం ఎల్లంపల్లి గ్రామానికి తలంబ్రాలు తీసుకెళ్లారు.

● చిగురుమామిడి: ఈ నెల 22వ తేదీన ప్రతి ఇంటిలో దీపాలు వెలగించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు శ్రీరామోజ్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండంలోని ఉల్లంపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శ్రీరామ జన్మభూమి దేవాలయా నిర్మాణానికి సంబంధిం చిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి దేవాలయ ప్రాణపతిష్ట కార్యక్రమం జరుగుతందన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రాంరంభోత్సవం సందర్భంగా ప్రతి హిందువు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నేలోజు వేంకటే శ్వర్లు, ట్రస్టు నిధుల సేకరణ గ్రామ కమిటీ అధ్యక్షులు పత్తెం మొగిళి, శ్రీమర్తి తిరుపతి, రాగుల రవీందర్, కొల ప్రసాద్, బల్లు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పేలిన నాటు బాంబులు

● భయభ్రాంతులకు గురైన స్థానికులు

సైదాపూర్, జనవరి 1: సైదాపూర్ మండల కేంద్రం సోమవారం నాటు బాంబులు పేలాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండల కేంద్రంలోని పెద్ద దుకాణం చౌరస్తా వద్ద సోమవా రం పెద్ద శబ్ధంతో ఒక బాంబు పేలింది. దాంతో చుట్టు పక్కల వారు బయటకు వచ్చి చూసేసరికి ఇంకో బాంబు పేలింది. ఏం జరుగుతుందో అర్థం కాకముందే అటు వైపు నుంచి బైకు టైర్ పక్కనే మరో బాంబు పేలింది. దీంతో బైకు టైరు పగిలింది. స్థానికులు ఆ ప్రాంతంలో చూడగా ఒకే చోట నాటు బాంబులు కుప్పగా పడి ఉన్నాయి. కొంత దూరం వరకు అక్కడక్కడ మరికొన్ని పడి ఉన్నాయి. దీంతో అక్కడున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నాలుబాబులను కవర్‌లో వేసుకుని తీసుకెళ్లారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.నాటు బాంబులు అక్కడికి ఎలావచ్చాయి.. ఎవరైన కావాలని వేశారా.. లేక ఎవరైనా తీసుకెళ్తుంటే రోడ్డుపై పడిపోయాయా అని పోలీసులు విచారణ జరుపుతున్నారు.



సైదాపూర్‌లో రోడ్డుపై ఉన్న నాటు బాంబులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 1: నగరంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. రామచంద్రాపూర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, లేక్ పోలీస్‌స్టేషన్, ఆర్‌సిపీ, బైపాస్‌రోడ్, పెద్దమ్మ దేవాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

సుభాష్‌నగర్, జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గవర్నర్ తమిళసై సౌందరరాజన్ సోమవారం కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేతితో పేయి గవర్నర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పూట్కూరి రాధాకృష్ణరెడ్డి, మెడికేర్ పార్చూన్ ఆసుపత్రి చైర్మెన్ ముప్పిడి రాజశేఖర్‌రెడ్డి, యూత్ కో ఆర్డినేటర్ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అల్ఫోర్స్ చైర్మన్

కరీంనగర్ టౌన్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి విద్యాభివృద్ధికై, సమాజంలో సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని, జిల్లాను రాష్ట్రానికే తలమానికంగా నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

● పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్ రెడ్డిలు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాశాఖ పాక్షాన నోట్‌బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేతిరి తిరుపతిరెడ్డి, పల్లెపాటి వేణుగోపాల్‌రావు, నాయకులు చొల్లేటి శ్రీనివాస్, వరుకోలు నాగరాజు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా కల్పించడం హర్షణీయం

-కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుజిత్ కుమార్



మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి 1: ఆటో డ్రైవర్లు, హోమ్‌గార్డ్స్ వర్కింగ్ జర్నలిస్ట్స్, గిగ్ ప్లాట్‌ఫారం కార్మికులకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమా కల్పించడం హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ తెలిపారు. సామాజిక భద్రతా పథకం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నగరంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సుజిత్ కుమార్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను, అసంఘటిత కార్మికులకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. ఈ పథకం అమలు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు పులి ఆంజనేయులుగౌడ్, కంకణాల అనిల్, మెతుకు కాంతయ్య, శ్యాంసుందర్, దన్నాసింగ్, పొన్నం మధు, పోరండ్ల రమేశ్, విద్యాసాగర్, జ్యోతిరెడ్డి, ప్రసాద్, జీవన్, గంగుల దిలీప్, జేరిపోతుల వాసు, భరత్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా జడ్జి శ్రీవాణి

గన్నేరువరం, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం జిల్లా జడ్జి శ్రీవాణి మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జడ్జికి సన్మానం చేశారు. ఆలయా నికి ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, జనవరి1: దిగువ మానేరు జలాశయం నుంచి ఆదివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ యాసంగి సాగుకు నీటిని విడుదల చేశారు. నీటి విడుదల 500క్యూసెక్కులు నుంచి ప్రారంభించారు. సోమవారం కూడా 500క్యూసెక్కుల నీటినే వదిలాలు.

మున్నూరు కాపు సంఘం ఎన్నికలు

గంగాధర, జనవరి 1: గంగాధర మండలం మల్లాపూ ర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా కోల ప్రభాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సోమవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కోల మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా హరీష్, క్యాషియ ర్‌గా అయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

యేసు నామకరణ దినోత్సవం

గంగాధర, జనవరి 1: యేసు నామకరణ దినోత్స వాన్ని క్రైస్తవులు సోమవారం ఘనంగా నిర్వహించారు. డిసెంబరు 25న యేసు జన్మదినం క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా జనవరి ఆయనను చర్చిలోకి తీసుకువచ్చి నామకరణం చేసిన రోజును ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

రామడుగు, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పార్టీలు, కేకులతో కాకుండా కొందరు పిల్లల ముఖాల్లో చిరునవ్వు నింపుతూ ఆహ్వానించారు హెల్పింగ్ హ్యాండ్స్ ఎన్‌జీవో సభ్యులు. ఒక వారం రోజుల క్రితం చేతిలో పుస్తకాలతో బడులకు వెళ్తున్న పిల్లలను గమనించిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యుసీ) సభ్యులు కళింగ శేఖర్ ఆ విషయాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ ఎన్‌జీవో ఫౌండర్ ప్రెసిడెంట్ జక్కుల రాజుకు తెలుపగా నూతన సంవత్స రం సందర్భంగా ప్రశాంత్‌భవన్‌లో విద్యార్థులకు కావా ల్సిన దాదాపు 30 బ్యాగులను అందజేశారు. ఈ కార్య క్రమంలో సీడబ్ల్యుసీ సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, ఎన్‌జీవో అధ్యక్షులు జక్కుల రాజు, ప్రశాంత్ భవన్ నిర్వాహకులు, సూపరింటెండెంటట్ సిరిల్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

చొప్పదండి, జనవరి 1: చొప్పదండి శివారులోని ఒక టెంట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. వీరి వద్ద నుంచి 16,400 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.